క్లుప్తంగా

ప్రాజెక్టుల ప్రదర్శన



విద్యార్థుల ప్రాజెక్టులను పరిశీలిస్తున్న అధ్యాపకులు

గండేపల్లి: నూతన అంశాలను తెలుసుకునేందుకు ప్రాజెక్ట్ ఎక్స్పో దోహదపడుతుందని ఆదిత్య యూనివర్సిటీ డిప్యూటీ ప్రో చాన్సలర్ ఎం.శ్రీనివాసరెడ్డి తెలిపారు. సూరంపాలెం ఆదిత్య యూనివర్సిటీలో ప్రాజెక్ట్ ఎక్స్పో 2కే25లో భాగంగా ఒక రోజు ప్రాజెక్టు ప్రదర్శన నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు తమ ఆలోచనలను పరస్పరం పంచుకోవడంతో పాటు ఎంతో ప్రేరణ కలిగించాయన్నారు. ఎంసీఏ నాల్గో సెమిస్టర్ విద్యార్థులు ప్రదర్శించిన ప్రాజెక్టులు విజ్ఞానదాయకంగా ఉన్నాయని తెలిపారు. కార్యక్రమంలో వైస్ చాన్సలర్ ఎంబీ శ్రీనివాస్, ప్రో చాన్సలర్ రమాశ్రీ, డీన్ డోలా సంజయ్, విద్యార్థులు పాల్గొన్నారు.

వాల్ పోస్టర్ ఆవిష్కరణ

జగ్గంపేట: శ్రీకాకుళం జిల్లా పలాసలో ఈ నెల 13న జరిగే సాయుధ రైతాంగ పోరాట నాయకుడు పైలా వాసుదేవరావు వర్ధంతి సభను జయప్రదం చేయాలని సీపీఐ (ఎంఎల్) న్యూ డెమోక్రసీ జిల్లా కమిటీ సభ్యులు ఎం .ఏసుబాబు పిలుపునిచ్చారు. మండలంలోని రామవరం భగత్‌సింగ్ నగర్‌లో శుక్రవారం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. అనంతరం పైలా వర్ధంతి సభ వాల్ పోస్టర్‌ను ఆవిష్కరించారు. పీవైఎల్ జిల్లా నాయకులు గంట బాలరాజు, రైతు కూలీ సంఘం జిల్లా నాయకులు దుర్గాడ అప్పారావు, ఐఎఫ్‌టీయూ జిల్లా కమిటీ సభ్యులు దార్ల వీరభద్రరావు, మహిళా సంఘ నాయకులు బుజ్జమ్మ, రాజు, వీరలక్ష్మి, మణి, వెంకటలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

ఎంపీడీఓకు పదోన్నతి



ఎంపీడీఓకు అభినందనలు తెలియజేస్తున్న అధికారులు

గండేపల్లి: స్థానిక ఎంపీడీఓ నాతి బుజ్జికి పదోన్నతి లభించింది. ఆమెకు డివిజనల్ డెవలప్‌మెంట్ అధికారి (డీఎల్‌డీఓ)గా పదోన్నతి కల్పిస్తూ ఉన్నతాధికారుల నుంచి ఉత్తర్వులు జారీ అయినట్టు కార్యాలయ సిబ్బంది తెలిపారు. ఉపాధి ఏపీఓ కృష్ణంరాజు, ఏఓ చంద్రరావు, ఆఫీస్, ఎన్ఆర్‌జీఎస్, సిబ్బంది ఆమెకు శుభాకాంక్షలు తెలిపారు. ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ, ఎంపీపీ చలగళ్ల దొరబాబు, వైస్ ఎంపీపీ కుంచె రాజా తదితర ప్రజాప్రతినిధులు అభినందనలు తెలిపారు.

డ్రైవర్‌ను వెంటనే విధుల్లోకి తీసుకోవాలి

ఏలేశ్వరం: స్థానిక ఆర్టీసీ డిపో డ్రైవర్ ఎస్వీ రమణను వెంటనే విధుల్లోకి తీసుకోవాలని నేషనల్ మజ్దూర్ యూనియన్ జోనల్ ఆర్గనైజింగ్ కార్యదర్శి ఎస్ఎస్ కుమారి డిమాండ్ చేశారు. స్థానిక ఆర్టీసీ డిపో వద్ద శుక్రవారం జిల్లా యూనియన్ వర్కింగ్ ప్రెసిడెంట్ కె.రవి ఆధ్వర్యంలో నిర్వహించిన ఉద్యోగుల ఆందోళనలో ఆమె పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ స్థానిక ఆర్టీసీ డిపోకు చెందిన డ్రైవర్ ఎస్వీ రమణను 1/2009 సర్క్యులర్‌కు విరుద్ధంగా అక్రమంగా సస్పెండ్ చేశారన్నారు. ఉద్యోగులు ధర్నాలు చేస్తున్నా యాజమాన్యం స్పందించకపోవడం దారుణమన్నారు. ఎస్వీ రమణను విధుల్లోకి తీసుకునే వరకూ ఉద్యమం చేస్తామన్నారు. కార్యక్రమంలో పలువురు ఉద్యోగులు పాల్గొన్నారు.

బీపీ, సుగర్ పరీక్షలు చేయించుకోవాలి

తుని: బీపీ, సుగర్ పరీక్షలు తరచూ చేయించుకోవడం ద్వారా మెరుగైన ఆరోగ్యం సాధించవచ్చని స్థానిక వాకర్ హెల్త్‌క్లబ్ అధ్యక్షుడు డీఎస్ మూర్తి సూచించారు. తుని వాకర్స్ హెల్త్‌క్లబ్ ఆధ్వర్యంలో నిర్వహించే డయాబెటిక్ కేర్ సెంటర్‌ను శుక్రవారం ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వాకర్లంతా ఆరోగ్యంపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. క్లబ్ నిర్వహించే డయాబెటిక్ కేర్ సెంటర్‌ను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఈ వైద్య శిబిరంలో సూర్యనారాయణ, ప్రసాద్ వాకర్లకు వైద్య పరీక్షలు చేశారు. కార్యక్రమంలో క్లబ్ ప్రతినిధులు కుందెం సత్యనారాయణ, వాడపల్లి శ్రీనివాస్, రెడ్డి చిరంజీవి, కండవల్లి డేనియేల్, పర్వత బాబూరావు తదితరులు పాల్గొన్నారు.

సమస్యలు ఏకరువు పెట్టిన గ్రామస్తులు

ప్రత్తిపాడు: మండలంలోని ఏలూరులో శుక్రవారం బీజేపీ నాయకులు «గావ్ చలో» కార్యక్రమాన్ని నిర్వహించారు. బీజేపీ నేషనల్ కౌన్సిల్ సభ్యుడు శింగిలిదేవి సత్తిరాజు, బీజేపీ కిసాన్ మోర్చా జిల్లా కార్యదర్శి దేవర రామకృష్ణ యాదవ్, దాడిశెట్టి శేషగిరి తదితరులు గ్రామంలో పర్యటించారు. గ్రామంలో తాగునీరు సక్రమంగా అందడం లేదని, ఉపాధి పని దినాలు, పారిశుధ్యం, భూ సర్వేలో అవకతవకలు, పింఛన్లు, కొత్త రేషన్ కార్డులు తదితర సమస్యలను ప్రజలు ఏకరువు పెట్టారు. సమస్యలను ప్రభుత్వ దృష్టికి తీసుకువెళ్తామని బీజేపీ నాయకులు వారికి హామీ ఇచ్చారు.

అంగన్‌వాడీ.. నడవని బడి

- విధి నిర్వహణలో సిబ్బంది నిర్లక్ష్యం
- కేంద్రాలపై కొరవడిన పర్యవేక్షణ
- ప్రీస్కూళ్లలో తగ్గిపోయిన పిల్లల హాజరు



నలుగురు పిల్లలతో నిర్వహిస్తున్న ఎల్డీపేట అంగన్‌వాడీ కేంద్రం-2

కోటనందూరు: బుడిబుడి అడుగులు వేసే చిన్నారులకు ఆటపాటలతో పాటు అక్షరజ్ఞానాన్ని నేర్పించి ప్రాథమిక విద్యకు పటిష్ఠ పునాది వేయాలన్నది అంగన్‌వాడీ కేంద్రాల లక్ష్యం. అందుకు అనుగుణంగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల సమన్వయంతో పల్లెల్లో ప్రతి 1000 మంది జనాభాకు ఒక అంగన్‌వాడీ కేంద్రాన్ని ఏర్పాటు చేసి సకల సౌకర్యాలను కల్పిస్తున్నారు. కాగా ప్రస్తుతం అంగన్‌వాడీ కేంద్రాలు ప్రభుత్వ లక్ష్యానికి విరుద్ధంగా నడుస్తున్నాయి. సిబ్బంది సమయపాలన పాటించకుండా అత్యంత నిర్లక్ష్యం వహిస్తున్నారు. సాధారణ రోజుల్లో ఉదయం 9 గంటలకు ప్రస్తుతం (వేసవి నేపథ్యంలో) 8 గంటలకు విధులకు హాజరు కావాల్సిన సిబ్బంది ఉదయం 10 గంటలు దాటే వరకూ కేంద్రాలకు వచ్చే పరిస్థితి లేదు. కేంద్రాలు తెరిచిన తరువాత సిబ్బంది కేవలం పిల్లలకు ఆహారాన్ని పెట్టి ఇంటికి పంపించేయడానికే పరిమితమవుతున్నారు తప్ప కనీసం ఒక్క అక్షరం, ఆట, పాట నేర్పించే పరిస్థితి లేదని ప్రజల నుంచి ఆరోపణలు వినిపిస్తున్నాయి. సంబంధిత అధికారులు కనీసం నెలకు ఒక్కసారి ప్రతి కేంద్రాన్ని తనిఖీ చేసే పరిస్థితి కనిపించడం లేదని స్థానికులు చెబుతున్నారు. స్థానిక ప్రజాప్రతినిధుల పర్యవేక్షణ లేకపోవడంతో అంగన్‌వాడీ సిబ్బంది, అధికారులూ కుమ్మక్కై కేంద్రాల నిర్వహణను ఇష్టారాజ్యంగా మార్చేశారు.

మండలంలో 51 అంగన్‌వాడీ కేంద్రాలు

కోటనందూరు మండలంలో 51 అంగన్‌వాడీ కేంద్రాలు ఉన్నాయి. వీటి పరిధిలో గర్భిణులు 167, బాలింతలు 247, 3 సంవత్సరాల లోపు పిల్లలు 1192, ప్రీ స్కూల్ పిల్లలు 786 మంది ఉన్నట్లు అధికారిక లెక్కలు చెబుతునాయి. అధికారిక లెక్కలకు క్షేత్రస్థాయి వాస్తవ పరిస్థితులు పూర్తి విరుద్ధంగా ఉన్నాయి. ముఖ్యంగా ప్రీస్కూలు చిన్నారుల లెక్కలో భారీ వ్యత్యాసాలు కనిపిస్తున్నాయి. ఎస్సీ ఏరియాల్లో కేంద్రాలను మినహాయిస్తే మిగిలిన కేంద్రాల్లో పిల్లల సంఖ్య 4 లేదా 5గా మాత్రమే ఉంటోంది. ఎందుకు ఇంత తేడా ఉందని ప్రశ్నిస్తే పిల్లలు వచ్చి వెళ్లి పోతున్నారని సిబ్బంది కాకమ్మ కథలు చెబుతున్నారు. హాజరు పట్టీల్లో నమోదైన పిల్లల సంఖ్య ఆధారంగానే ప్రభుత్వం పౌష్టికాహారాన్ని సరఫరా చేస్తోంది. అంటే పెద్ద ఎత్తున అక్రమాలు జరుగుతున్నట్లు స్పష్టమవుతోంది. ఇక మధ్యాహ్నం తరువాత చాలా కేంద్రాలు మూతపడుతున్నాయి.

కేంద్రాలపై కొరవడిన పర్యవేక్షణ

అంగన్‌వాడీ కేంద్రాలపై ప్రజాప్రతినిధులు, అధికారుల పర్యవేక్షణ కొరవడింది. ఇతర అధికారుల మాట ఎలా ఉన్నా..కనీసం ప్రాజెక్టు అధికారులు కూడా కేంద్రాలను తనిఖీ చేయడం లేదు. అధికారులు ఎప్పుడైనా కేంద్రాలను సందర్శించినా కేవలం రికార్డులు తనిఖీకే పరిమితమవుతున్నారు తప్ప కేంద్రాలు నిబంధనల మేరకు పని చేస్తున్నాయా? లేదా? ప్రీస్కూలు పిల్లల హాజరు శాతం ఎలా ఉంది, పిల్లలు తక్కువగా ఉంటే కారణాలు ఏంటి, హాజరు శాతం పెంచడానికి ఎలాంటి చర్యలు తీసుకోవాలి? తదితర విషయాలు పట్టించుకోవడం లేదని, తనిఖీ, పర్యవేక్షణ అధికారుల నిర్లక్ష్యమే అంగన్‌వాడీ కేంద్రాలు దిగజారిపోవడానికి కారణమని స్థానికులు ఆరోపిస్తున్నారు.

భోజనానికే పరిమితం చేస్తున్నారు



అంగన్‌వాడీ కేంద్రాల్లో సిబ్బంది పిల్లలకు కేవలం భోజనం పెట్టి ఇంటికి పంపించేయడానికే పరిమితమవుతున్నారు. చదువు మాట ఎలా ఉన్నా కనీసం ఆట, పాట కూడా చెప్పే పరిస్థితి కనిపించడం లేదు. ప్రాథమిక విద్యాబుద్ధులు నేరపించడంలో విఫలమవుతున్నారు. ప్రభుత్వ లక్ష్యానికి అనుగుణంగా అంగన్‌వాడీ కేంద్రాలు నడిచేలా సంబంధిత అధికారులు చర్యలు తీసుకోవాలి.

– ఉల్లూరి కనకదుర్గ శ్రీను, కోటనందూరు

వనదుర్గ అమ్మవారికి చండీ హోమం

అన్నవరం: రత్నగిరిపై వనదుర్గ అమ్మవారికి శుక్రవారం చండీ హోమం నిర్వహించారు. పండితులు ఉదయం తొమ్మిది గంటలకు అమ్మవారికి ప్రత్యేక పూజలు చేసి హోమం ప్రారంభించారు. 11 గంటలకు హోమగుండంలో హోమద్రవ్యాలను సమర్పించి పూర్ణాహుతి నిర్వహించారు. అనంతరం అమ్మవారికి నీరాజన మంత్రపుష్పాలు సమర్పించి భక్తులకు ప్రసాదాలు పంపిణీ చేశారు. వేద పండితులు ఉపాధ్యాయుల రమేష్, అర్చకుడు కోట వంశీ, పరిచారకుడు వేణు వ్రతపురోహితులు చెల్లపిళ్ల ప్రసాద్, కూచుమంచి ప్రసాద్ తదితరులు హోమం నిర్వహించారు. దేవస్థానం ఈఓ వీర్ల సుబ్బారావు దంపతులు, ఆర్యవైశ్యసత్రం అధ్యక్షుడు పేరూరి గాంధీ, వ్యాపారవేత్త వీర్ల సూరిబాబు, మరో 30 మంది భక్తులు హోమంలో పాల్గొన్నారు.

అమ్మవార్లకు కుంకుమార్చన

సత్యదేవుని ప్రధానాలయంలో దేవేరి అనంతలక్ష్మీ సత్యవతీదేవి అమ్మవారికి ప్రధానార్చకుడు కోట సుబ్రహ్మణ్యం ఆధ్వర్యంలోనూ, తొలిపావంచా వద్ద కొలువైన కనకదుర్గ అమ్మవారికి అర్చకుడు చిట్టెం గోపీ ఆధ్వర్యంలోనూ పండితులు కుంకుమపూజలు నిర్వహించారు. అధిక సంఖ్యలో భక్తులు అమ్మవార్లను దర్శించి తీర్థ ప్రసాదాలు స్వీకరించారు.

నేడు ప్రత్యంగిర హోమం

పౌర్ణిమ పర్వదినం సందర్భంగా వనదుర్గ అమ్మవారికి శనివారం ప్రత్యంగిర హోమం నిర్వహించనున్నట్లు అధికారులు తెలిపారు.

ధాన్యం కొనుగోలు కేంద్రాల ప్రారంభం



కత్తిపూడిలో వరి రాశులను పరిశీలిస్తున్న ఏఓ గాంధీ

తొండంగి: మండల పరిధిలోని గ్రామాల్లో రబీ ధాన్యం కొనుగోలు కేంద్రాలను ప్రారంభించినట్టు మండల వ్యవసాయశాఖాధికారి ఎస్.నరసింహం శుక్రవారం తెలిపారు. అన్ని రైతుసేవా కేంద్రాల్లో ధాన్యం కొనుగోలు కేంద్రాలను సిద్ధం చేశామన్నారు. సాధారణ రకం 75 కిలోలకు రూ.1725, గ్రేడ్ ఏ రకం 75 కిలోలకు రూ.1740 మద్దతు ధర ప్రకటించారన్నారు. తేమ 17శాతం మించరాదన్నారు. రైతులు ధాన్యం విక్రయించదలిస్తే గ్రామ సచివాలయ అగ్రికల్చర్ అసిస్టెంట్లును సంప్రదించాలన్నారు. రైతులు దళారులను నమ్మి ఇబ్బందులు పడవద్దని సూచించారు.

శంఖవరం: ధాన్యం కొనుగోలు కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలని రైతులకు మండల వ్యవసాయాధికారి పి.గాంధీ సూచించారు. మండలంలోని కత్తిపూడిలో వరి కోతలు, నూర్పిడిలను శుక్రవారం ఆయన పరిశీలించారు. రైతులకు పలు సూచనలు చేశారు. ధాన్యం నాణ్యత, రవాణాను అనుసరించి మద్దతు ధరకు కొనుగోలు చేస్తున్నట్టు తెలిపారు. ప్రస్తుతం వాతావరణం వరి కోతలకు అనుకూలంగా లేనందున కోతలు వాయిదా వేయాలన్నారు. శంఖవరం, కత్తిపూడి, కొంతంగి గ్రామాల్లో కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేశామని తెలిపారు. కార్యక్రమంలో వ్యవసాయ సహాయకులు ప్రభాష్, మణికంఠ పాల్గొన్నారు.

ఘనంగా ఆలయ వార్షికోత్సవం

రౌతులపూడి: గ్రామంలో వేంచేసిన ఉమారామలింగేశ్వరస్వామి ఆలయ వార్షికోత్సవం శుక్రవారం వైభవంగా జరిగింది. ఆలయ పూజారి దొంతుకుర్తి సుబ్రహ్మణ్యం ఆధ్వర్యంలో పండితులు స్వామి, వార్లకు ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. అనంతరం విశేష అలంకరణ చేసి భక్తులకు దర్శనాలు కల్పించారు. అధిక సంఖ్యలో భక్తులు స్వామి, అమ్మవార్లను దర్శించుకుని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. ఆలయ కమిటీ సభ్యులు ఏర్పాట్లను పర్యవేక్షించారు.

1,000 లీటర్ల బెల్లపు ఊట ధ్వంసం

ప్రత్తిపాడు: స్థానిక ఎక్సైజ్ సర్కిల్ పరిధిలోని కిర్లంపూడి మండలం ఎస్.తిమ్మాపురంలో సారా స్థావరాలపై శుక్రవారం ఎక్సైజ్ పోలీసులు విస్తృతంగా దాడులు నిర్వహించారు. ఈ దాడుల్లో సారా తయారీకి సిద్ధం చేసిన 1,000 లీటర్ల పులిసిన బెల్లపు ఊటను ధ్వంసం చేసినట్టు స్థానిక ఎక్సైజ్ సీఐ పి.శివప్రసాద్ తెలిపారు. కాగా కిర్లంపూడి మండలంలోని పలు గ్రామాలకు చెందిన 12 మంది పాత నేరస్తులను అదుపులోకి తీసుకుని, వారిపై బైండోవర్ కేసులు నమోదు చేశామన్నారు. వీరిని శుక్రవారం సాయంత్రం కిర్లంపూడి తహసీల్దార్ జె.చిరంజీవి వద్ద హాజరుపరచినట్టు తెలిపారు.

మాణిక్యం కాంప్లెక్స్‌లో తనిఖీలు

జగ్గంపేట: స్థానిక జేవీఆర్ సెంటర్ నుంచి బస్టాండ్‌కు వచ్చే మార్గంలో ఉన్న మాణిక్యం కాంప్లెక్స్‌లో అసాంఘిక కార్యక్రమాలు జరుగుతున్నట్టు ఆరోపణలు వస్తున్న నేపథ్యంలో శుక్రవారం పోలీసులు తనిఖీలు నిర్వహించారు. బిల్డింగ్ యజమానులకు నోటీసులు జారీచేసినట్టు జగ్గంపేట సీఐ వైఆర్కే శ్రీనివాస్ తెలిపారు. కొంత మంది మీడియా ముసుగు వేసుకుని అసాంఘిక కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్టు గుర్తించి, సీపీసీ సెక్షన్ 149 కింద నోటీసులు జారీ చేశామన్నారు. తనిఖీల్లో ఎస్సై రఘునాథరావు, సిబ్బంది పాల్గొన్నారు.

మోదీ పాలనలో పారిశ్రామిక అభివృద్ధి

ప్రత్తిపాడు: ప్రధాని నరేంద్ర మోదీ పాలనలో పారిశ్రామిక అభివృద్ధిలో దేశం దూసుకుపోతోందని బీజేపీ కాకినాడ జిల్లా అధ్యక్షుడు బిక్కిన విశ్వేశ్వరరావు అన్నారు. శుక్రవారం ప్రత్తిపాడులో ఆయన విలేకరులతో మాట్లాడారు. భారత్‌ను ప్రధాని మోదీ తయారీ రంగంలో అభివృద్ధి పరుస్తున్నారన్నారు. ప్రస్తుతం భారత్‌లో ఎలక్ట్రిక్ వాహనాల వినియోగం పెరిగిందని తెలిపారు. కార్యక్రమంలో నియోజకవర్గ బీజేపీ కన్వీనర్ శింగిలిదేవి సత్తిరాజు, జిల్లా కార్యదర్శి కొల్లా శ్రీనివాస్, రాజబాబు, రామకృష్ణ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా వనవిహారోత్సవం



సీతారాములకు వనవిహారోత్సవం నిర్వహిస్తున్న పండితులు

అన్నవరం: రత్నగిరి క్షేత్రపాలకుడు శ్రీసీతారాముల దివ్య కల్యాణ మహోత్సవాల్లో భాగంగా ఏడోరోజు శుక్ర వారం సీతారాముల వనవిహారోత్సవం ఘనంగా నిర్వహించారు. సాయంత్రం నాలుగు గంటలకు పెళ్లిపెద్దలు సత్యదేవుడు, అనంతలక్ష్మీ సత్యవతీదేవి వెంట రాగా నవదంపతులు సీతారాములను ఊరేగింపుగా కొండదిగువన గార్డెన్ వద్దకు తీసుకువచ్చారు. అక్కడ ప్రత్యేక సింహాసనంపై నవదంపతులు సీతారాములను, మరో ఆశనం మీద పెళ్లిపెద్దలు సత్యదేవుడు, అనంతలక్ష్మీ సత్యవతీదేవి అమ్మవార్లను ప్రతిష్ఠించి పండితులు పూజలు చేశారు. నవదంపతులకు నూతన పట్టువస్త్రాలను దేవస్థానం ఈఓ సుబ్బారావు దంపతులు అందజేశారు. ప్రధానార్చకుడు కోట సుబ్రహ్మణ్యశర్మ అర్చకులు సుధీర్, దత్తాత్రేయశర్మ, కల్యాణబ్రహ్మ చామర్తి కన్నబాబు, పురోహితుడు పాలంకి పట్టాభి, రామాలయ అర్చకుడు దేవులపల్లి ప్రసాద్ పూజాది కార్యక్రమాలు నిర్వహించారు.

నేడు సీతారాములకు శ్రీచక్రస్నానం

ఉత్సవాల్లో భాగంగా ఎనిమిదో రోజు శనివారం పౌర్ణిమ సందర్భంగా ఉదయం ఎనిమిది గంటలకు పంపా నది వద్ద సీతారాములకు శ్రీచక్రస్నానం నిర్వహించనున్నట్లు పండితులు తెలిపారు.



ధర్మవరంలో 108 కలశాలతో స్వామి వారిని ఊరేగిస్తున్న భక్తులు

వైభవంగా కలశయాత్ర

ప్రత్తిపాడు రూరల్: ధర్మవరంలో అయ్యప్పస్వామి జన్మదిన వేడుకలను ఘనంగా నిర్వహించారు. స్థానిక అయ్యప్పస్వామి ఆలయంలో పండితులు ప్రత్యేక పూజలు, అభిషేకాలు, అర్చనలు నిర్వహించారు. అనంతరం 108 కలశాలతో గ్రామంలో ఊరేగింపు నిర్వహించారు. దారి పొడవునా భక్తులు స్వామి దర్శించుకొన్నారు. వైఎస్సార్ సీపీ నాయకుడు ముదునూరి మురళీ కృష్ణంరాజు, దాట్ల అప్పన్నబాబు, బొల్లు కొండబాబు, ఇందన ఏసుబాబు తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా మెట్లోత్సవం



చలువరాతి మెట్లకు పసుపు, కుంకుమ పెడుతున్న ఎమ్మెల్యే యనమల దివ్య

తుని రూరల్: తలుపులమ్మ అమ్మవారి లోవ దేవస్థానంలో నూతనంగా నిర్మించిన చలువరాతి మెట్లను శుక్రవారం ఎమ్మెల్యే యనమల దివ్య ప్రారంభించారు. మెట్లోత్సవంలో భాగంగా మెట్లకు పసుపు, కుంకుమ పెట్టి పూజలు నిర్వహించారు. అభివృద్ధి పనుల్లో భాగంగా రాజగోపురం ముందు రూ.30 లక్షలతో చలువరాతి మెట్లను నిర్మించినట్టు ఈఓ పెన్మెత్స విశ్వనాథరాజు తెలిపారు. వేసవిలో సైతం ఈ చలువరాతి మెట్లు భక్తులకు చల్లదనాన్ని ఇస్తాయన్నారు. అంతకుముందు లోవకొత్తూరు ఉపాలయం వద్ద నిర్మించిన మండపాన్ని ఎమ్మెల్యే ప్రారంభించారు. తుని మున్సిపల్ చైర్‌పర్సన్ కుచ్చర్లపాటి రూపాదేవి, మాజీ చైర్మన్ కుసుమంచి శోభారాణి, తాండవ షుగర్స్ మాజీ చైర్మన్ సుర్ల లోవరాజు, లోవ మాజీ చైర్మన్ దూలం మాణిక్యం, యనమల రాజేష్, అధికారులు పాల్గొన్నారు.

పంచాయతీ కార్యదర్శికి ఘనంగా వీడ్కోలు



పదోన్నతి పొందిన కార్యదర్శిని సత్కరిస్తున్న అధికారులు, ప్రజాప్రతినిధులు

ప్రత్తిపాడు: స్థానిక సచివాలయం – 3 కార్యదర్శి ఫక్కుర్తి శ్రీనివాసరావుకు అధికారులు, ప్రజాప్రతినిధులు శుక్రవారం ఘనంగా వీడ్కోలు పలికారు. కార్యదర్శి శ్రీనివాసరావు పదోన్నతిపై గ్రేడ్ 4 కార్యదర్శిగా మారేడుమిల్లికి బదిలీ అయిన సంగతి తెలిసిందే. స్థానిక గ్రామ పంచాయతీ కార్యాలయ ఆవరణలో కార్యదర్శి శ్రీనివాసరావును సర్పంచ్ గుడాల విజయలక్ష్మి ఆధ్వర్యంలో శాలువా, పూలమాలతో ఘనంగా సత్కరించారు. కమ్యూనిటీ హెల్త్ సెంటర్ అభివృద్ధి కమిటీ సభ్యుడు వెలుగుల నాని, యాళ్ల జగదీష్, ఎంపీడీఓ ఎంవీఆర్ కుమార్ బాబు, ఈఓఆర్డీ కేవీవీఎస్ కాశీ విశ్వనాథం తదితరులు పాల్గొన్నారు.

రీ సర్వేతో భూ సమస్యలకు చెక్

ఏలేశ్వరం: భూముల రీ సర్వేతో రైతులకు మేలు జరుగుతుందని ఎంపీపీ గొల్లపల్లి బుజ్జి అన్నారు. మండలంలోని యర్రవరంలో శుక్రవారం భూ రీసర్వేపై గ్రామసభ నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీపీ మాట్లాడుతూ రీ సర్వేతో గ్రామాల్లో భూ వివాదాలు పరిష్కారం అవుతాయన్నారు. రైతులు తమ భూములను రీసర్వే చేయించుకోవాలన్నారు. రీ సర్వేను రైతులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో అధికారులు, రైతులు పాల్గొన్నారు.

ప్రత్తిపాడు రూరల్: ప్రభుత్వం చేపట్టిన భూముల రీ సర్వే రైతుల భూమికి శ్రీరామ రక్షగా నిలుస్తుందని తహసీల్దార్ ఎం.సూర్యప్రభ అన్నారు. మండలంలోని ఒమ్మంగిలో శుక్రవారం గ్రామ సభ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గ్రామాన్ని 22 భాగాలు విభజించి 22 మంది రెవెన్యూ బృందాలతో సమగ్ర భూ సర్వే చేపట్టనున్నట్లు తెలిపారు. సర్వేకు రైతులు సహకరించి, సద్వినియోగం చేసుకోవాలని ఆమె కోరారు. కార్యక్రమంలో ఆర్ఐ గోపాలకృష్ణ, మండల సర్వేయర్ బషీర్, మాజీ ఎంపీపీ సత్యంశెట్టి సీతబాబు, కొప్పన రాజబాబు, సుంకర సోమరాజు, రెవెన్యూ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

బలహీన వర్గాల ఆశాజ్యోతి ఫూలే

- ఘనంగా జ్యోతిరావు ఫూలే జయంతి
- ఆయన విగ్రహాలు, చిత్రపటాలకు ఘన నివాళులు



తునిలో తహసీల్దార్, మున్సిపల్ కమిషనర్‌లను సత్కరిస్తున్న బీసీ ఐక్య వేదిక ప్రతినిధులు



ఏలేశ్వరంలో జ్యోతిరావు ఫూలే విగ్రహానికి నివాళులర్పిస్తున్న వైఎస్సార్ సీపీ నాయకులు

ఏలేశ్వరం: బడుగు, బలహీన వర్గాల ఆశాజ్యోతి మహాత్మా జ్యోతిరావు ఫూలే జయంతి వేడుకలను తుని, ప్రత్తిపాడు, జగ్గంపేట నియోజకవర్గాల్లో శుక్రవారం ఘనంగా నిర్వహించారు. వైఎస్సార్ సీపీ నేత సామంతుల సూర్యకుమార్ ఆధ్వర్యంలో స్థానిక కోనేటి బడి వద్ద ఫూలే విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా సూర్యకుమార్ మాట్లాడుతూ బలహీన వర్గాల అభ్యున్నతికి జ్యోతిరావు ఫూలే చేసిన సేవలు అపూర్వమన్నారు. నేటి యువత ఆయన ఆశయాలను స్ఫూర్తిగా తీసుకోవాలన్నారు. వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో మాజీ సీఎం జగన్ బడుగు బలహీన వర్గాలకు పెద్దపీట వేశారన్నారు. వైఎస్సార్ సీపీ నాయకులు పైల విజయ్‌కుమార్, సుంకర రాంబాబు, కావలి శ్రీనివాసరావు, పి.జగదీష్ పాల్గొన్నారు.

జగ్గంపేట: స్థానిక ప్రభుత్వ పాఠశాల వద్ద జ్యోతిరావు ఫూలే విగ్రహానికి బీజేపీ నియోజకవర్గ కన్వీనర్ దాట్ల కృష్ణ వర్మ ఆధ్వర్యంలో పూలమాల వేసి నివాళులర్పించారు. బలహీన వర్గాల కోసం ఫూలే చేసిన సేవలను కృష్ణ వర్మ కొనియాడారు. పార్టీ మండల అధ్యక్షుడు పల్లా రాము, బూత్ కమిటీ మెంబర్ బియ్యంపల్లి రమణ, ఎస్.రంగా, సతీష్, కురుమళ్ల నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

రౌతులపూడి: స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో జ్యోతిరావు ఫూలే చిత్ర పటానికి ఎంపీడీఓ బి.శివరామకృష్ణయ్య ఆధ్వర్యంలో పూలమాల వేసి నివాళులర్పించారు. సమసమాజ స్థాపనలో భావితరాలకు స్ఫూర్తి ప్రదాత ఫూలే అని కొనియాడారు. కార్యక్రమంలో మండల పరిషత్ సిబ్బంది, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

గండేపల్లి: స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో శుక్రవారం జ్యోతిరావు ఫూలే జయంతి నిర్వహించారు. అధికారులు, ప్రజాప్రతినిధులు ఫూలే చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో ఎంపీపీ చలగళ్ల దొరబాబు, ఎంపీడీఓ నాతి బుజ్జి, ఏఓ చంద్రరావు, ఏపీఓ ఎం. కృష్ణంరాజు తదితరులు పాలొన్నారు.

కిర్లంపూడి: స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో జ్యోతిరావు ఫూలే చిత్రపటానికి ఎంపీడీఓ బి.హరికృష్ణ ఆధ్వర్యంలో పూలమాల వేసి నివాళులర్పించారు. ఈఓపీఆర్డీ సత్యప్రసాద్, హౌసింగ్ ఏఈ కె.భవాని, ఏఓ హర్షవర్ధన్‌రాజు పాల్గొన్నారు.

తుని రూరల్: స్థానిక మండల పరిషత్ కార్యాలయ ఆవరణలో మహాత్మా జ్యోతిరావు ఫూలే చిత్రపటానికి ఎంపీపీ డాక్టర్ బొప్పన రాము, ఎంపీడీఓ కె.సాయినవీన్ ఆధ్వర్యంలో పూలమాల వేసి నివాళులర్పించారు. జ్యోతిరావు ఫూలే సేవలు నేటి తరానికి ఆదర్శనీయమన్నారు. ఈఓపీఆర్డీ జి.మరిడియ్య, ఎన్ఆర్ఈజీఎస్ సిబ్బంది పాల్గొన్నారు.

ప్రత్తిపాడు: స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో ఎంపీపీ గోళ్ల కాంతి సుధాకర్, ఎంపీడీఓ ఎంవీఆర్ కుమార్‌బాబు ఆధ్వర్యంలో మహాత్మా జ్యోతీరావు ఫూలే చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. వైఎస్సార్ సీపీ నాయకుడు పినిశెట్టి ప్రకాష్, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు. స్థానిక కోర్టు ఆవరణలో న్యాయమూర్తి కాటం భాను ఆధ్వర్యంలో జ్యోతిరావు ఫూలే చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అంటరానితనం, కులవ్యవస్థ నిర్మూలనకు ఫూలే చేసిన కృషి ఎనలేనిదని న్యాయమూర్తి కొనియాడారు. బార్ అధ్యక్ష, కార్యదర్శులు రాజాల చిట్టిబాబు, బొంగుళూరి మధుబాబు పాల్గొన్నారు. స్థానిక ఐలాజ్ కార్యాలయంలో ఫూలే చిత్రపటానికి ఆల్ ఇండియా లాయర్స్ అసోసియేషన్ ఫర్ జస్టిస్ (ఐలాజ్) రాష్ట్ర కార్యదర్శి బుగత శివ ఆధ్వర్యంలో ఐలాజ్ నాయకులు అవసరాల దేవి, జోగా ప్రసాద్ తదితరులు ఫూలే చిత్రపటానికి పూలమాల వేసి, నివాళులర్పించారు.

తుని: స్థానిక రాజారాజుబాబు మున్సిపల్ పార్కులోని ఫూలే సెంటర్‌లో బీసీ ఐక్య వేదిక ఆధ్వర్యంలో మహాత్మ జ్యోతిరావు ఫూలే జయంతి వేడుకలు నిర్వహించారు. మున్సిపల్ కమిషనర్ ఎ.వెంకటరావు, తహసీల్దార్ వెంకటసత్యప్రసాద్, గవర కార్పొరేషన్ డైరెక్టర్ మళ్ల గణేష్ ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఫూలే చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. జ్యోతిరావు ఫూలే సమాజానికి చేసిన సేవలను కొనియాడారు. అనంతరం ఐక్య వేదిక ఆధ్వర్యంలో అతిథులను సత్కరించారు. కార్యక్రమంలో బీసీ ఐక్య వేదిక అధ్యక్షుడు గోవిందరావు, కార్యదర్శి కర్రి వెంకటరమణ, నెల్లిపూడి బ్రహ్మాజీ పాల్గొన్నారు.

తొండంగి: పెరుమాళ్లపురం ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో జ్యోతిరావు ఫూలే జయంతి నిర్వహించారు. కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎంవీకే మెహర్ ఆధ్వర్యంలో జ్యోతిరావు ఫూలే చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. సమాజంలో అసమానతలు తొలగించేందుకు, స్త్రీల అభ్యుదయానికి ఫూలే చేసిన సేవలను కొనియాడారు. ఎన్ఎస్ఎస్ యూనిట్ మేనేజర్ టి.రాము, అధ్యాపకులు సిద్ధార్థబాబు, మహాలక్ష్మి నాయుడు పాల్గొన్నారు.

ప్రత్తిపాడు రూరల్: మండలంలోని ధర్మవరంలో వైఎస్సార్ సీపీ నాయకుడు, ఎంఎంఆర్ చారిటబుల్ ట్రస్టు చైర్మన్ ముదునూరి మురళీకృష్ణంరాజు ఆధ్వర్యంలో మహాత్మ జ్యోతిరావు ఫూలే జయంతి వేడుకలను నిర్వహించారు. ఫూలే చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. కార్యక్రమంలో కోలా తాతబాబు, బొల్లు నాగేశ్వరరావు, దొరబాబు, పోకనాటి వెంకటేశ్వరరావు, యాళ్ల ఏసు, దొడ్డిపట్ల కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

ఎంపీడీఓ సూర్యనారాయణకు సన్మానం



ఏలేశ్వరంలో ఎంపీడీఓ, ఏపీఓలను సన్మానిస్తున్న ఎంపీపీ గొల్లపల్లి బుజ్జి

ఏలేశ్వరం: పట్టణంలో శుక్రవారం ఎంపీడీఓ సూర్యనారాయణను ఘనంగా సన్మానించారు. మహాత్మా గాంధీ జాతీయ ఉపాధి హామీ పథకం అమలులో ఏలేశ్వరం మండలం జిల్లాలో నాలుగో స్థానం పొందింది. దీంతో స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీడీఓ సూర్యనారాయణ, ఏపీఓ సత్యనారాయణను ఎంపీపీ గొల్లపల్లి బుజ్జి శాలువా, పూలమాల, మెమెంటోతో సన్మానించారు. ఈ సందర్భంగా ఎంపీపీ మాట్లాడుతూ ఉపాధి పనుల్లో మండలం నాలుగో స్థానం పొందేందుకు ఎంపీడీఓ, ఏపీఓ కృషి అభినందనీయమన్నారు. రాబోయే రోజుల్లో మండలం ప్రథమ స్థానం పొందాలని ఆకాంక్షించారు.

విగ్రహాలు ప్రారంభం

ప్రత్తిపాడు: స్థానిక మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో పీఎంసీ చైర్మన్ చిట్రా రాంబాబు తన సొంత నిధులతో సరస్వతీ, గణపతి విగ్రహాలను ఏర్పాటు చేశారు. ఈ విగ్రహాలను బీజేపీ నియోజకవర్గ కన్వీనర్ శింగిలిదేవి సత్తిరాజు శుక్రవారం ప్రారంభించారు. కార్యక్రమంలో సీహెచ్‌సీ అభివృద్ధి కమిటి సభ్యుడు వెలుగుల నాని, మాజీ సర్పంచ్ యాళ్ల విశ్వేశ్వరరావు, చెలంకూరి భాను, గోపిశెట్టి శ్రీను, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.